క్లుప్తంగా

అమ్మా.. ఆశీర్వదించు



పెద్దకొత్తపల్లి: మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శ్రావణమాసం ముగియడంతో భక్తులు వివిధ ప్రాంతాలకు మైసమ్మ దేవతకు కోళ్లు, మేకలు బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అచ్చంపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, పెబ్బేరు, కొల్లాపూర్, మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నట్లు ఎండోమెంట్ అధికారి రంగారావు తెలిపారు.

నేడు రాజశ్యామల యాగం

కొల్లాపూర్: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం రాజశ్యామల యాగం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని యాగం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఐదు రోజుల పాటు యాగం కొనసాగుతుందని వివరించారు.

ఇంటింటి బీఎస్పీ ప్రచారం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ముక్కిడిగుండం, నార్లాపూర్ గ్రామాల్లో ఆదివారం బీఎస్పీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బంకల దాస్ మాట్లాడుతూ బీఎస్పీతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ నాయకులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి



కల్వకుర్తిరూరల్: మండలంలోని జిల్లెల్లలో గౌడ సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ గంగయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు ఆదివారం క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ రాజు, గౌడసంఘం నాయకులు పాండుగౌడ్, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

తెలకపల్లి: మండలంలోని నడిగడ్డ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రెండు రోజుల కిందట బస్సు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ప్రజా సంఘాల నాయకులు బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మందుల ప్రభాకర్, గోపస్ లక్ష్మణ్, ఎం విజయ్‌గౌడ్, బి చంద్రకళ, మాకం రామచంద్రయ్యలు పాల్గొన్నారు.

దహన వాటికలకు శంకుస్థాపన



బిజినేపల్లి: మండలంలోని పాలెం స్మశాన వాటికలో దహన వాటిక, ప్రహరీ నిర్మాణం కోసం ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌లకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ లావణ్య, నాయకులు గంధం వెంకటేష్, అర్జున్, శ్రీధర్, శ్రీనివాసులు, బాలరాజ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరికలు



కోడేరు: మండలంలోని ముూలమడత తండాకు చెందిన 30 మంది వివిధ పార్టీల నాయకులు ఆదివారం ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బీఆర్‌ఎస్ చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి అండగా ఉంటామని అన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



చారకొండ సారంబండ తండాలో



పెంట్లవెల్లిలో..



కల్వకుర్తిలో

విఘ్నేశ్వరా.. కరుణించు

కందనూలు: జిల్లా కేంద్రంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం సంత బజార్‌లో త్రిదలన్ యూత్, హౌసింగ్ బోర్డు కాలనీలో రెబల్ యూత్, వీర శివాజీ యూత్, మైల్‌స్టోన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథులను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకొన్నారు. పట్టణంలోని రాఘవేందర్ కాలనీలో భజరంగ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద సోమవారం సామూహిక గణపతి హోమాలు వైభవంగా నిర్వహించారు. మహిళలు కోలాటాలు, బొడ్డెమ్మ ఆడిపాడారు. పలు మండపాల వద్ద అన్నదానం చేశారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలో పలు వినాయక మండపాల వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, మున్సిపల్ చైర్మన్ సత్యం పాల్గొన్నారు.

కల్వకుర్తిటౌన్: పట్టణంలోని ప్రధాన కూడళ్లు, కాలనీల్లో మట్టి గణపతిని ఏర్పాటు చేసిన నిర్వాహకులను యూత్ ఫర్ సేవ సభ్యులు శాలువాలతో సన్మానించారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని పలు వినాయక మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు జటప్రోల్, మల్లేశ్వరం గ్రామాల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. యువకులు నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా వెళ్లారు. శోభాయాత్ర అందరిని ఆకట్టుకుంది.

చారకొండ: మండలంలోని సారంబండ తండాల్లో సర్పంచ్ రాజు నాయక్ ఆధ్వర్యంలో గణనాథునికి ప్రత్యేక పూజలు చేసి అన్నదానంలో పాల్గొన్నారు. సిర్సనగండ్లలో సర్పంచ్ యాతం శారదశ్రీనివాస్ అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీందాస్ నాయక్, గోపాల్ గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవం

లింగాల: మండల కేంద్రంలోని రామాలయం సమీపంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను ఆదివారం కోలహాల మధ్య నిమజ్జనోత్సవం నిర్వహించారు. ఏడు రోజుల పాటు పూజలందుకున్న గణనాథులను ప్రత్యేక వాహనాలలో ఊరేగించారు. యువకులు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేశారు.

వెల్దండ: మండలంలోని బైరాపూర్‌లో ఆదర్శ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. అంతకుముందు సర్పంచ్ దార్ల కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పబ్బు దశరథ్‌గౌడు రూ.40,100 వేలం పాటలో లడ్డును దక్కించుకున్నారు. ఉపసర్పంచ్ రమేష్‌గౌడు, జైపాల్‌నాయక్, సంఘం అధ్యక్షుడు జహంగీర్, వెంకటేష్ ఉన్నారు.



లింగాలలో గణనాథుల ఊరేగింపు



కల్వకుర్తిలో



నాగర్‌కర్నూల్‌లో



నాగర్‌కర్నూల్ గణపతి హోమాలు

సెల్ఫీ విత్ గణేశ్

మీరు పర్యావరణ పరిరక్షణలో భాగమై మట్టి గణేశుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారా.. జిల్లాలోని అపార్ట్‌మెంట్, కమ్యూనిటీ లేదా ఇళ్లలో ప్రత్యేక ఆకృతుల్లో ఏర్పాటు చేశారా. అయితే మీ విగ్రహ ప్రత్యేకతలను 'సాక్షి'తో పంచుకోండి. మట్టి, ప్రత్యేక ఆకృతుల విగ్రహాలతో సెల్ఫీ తీసి వాట్సాప్ చేయండి. మీ పేరు, చిరునామాను స్పష్టంగా పంపించండి. ఎంపిక చేసిన ఫొటోలను ప్రచురిస్తాం.



నాగర్‌కర్నూల్‌లో..

వాట్సాప్ చేయాల్సిన నంబర్ **82473 73051**

మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి

తాడూరు: మండలంలోని మేడిపూర్ తుమ్మలకుంటలో ఆదివారం మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు అశోక్ ఆధ్వర్యంలో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 36 వేల చేప పిల్లలను వదిలినట్లు పేర్కొన్నారు. మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. మత్స్యకారుల కుటుంబాలకు చేయూతనిచ్చిన ప్రభుత్వానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో జంగయ్య, రాములు, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.



తమ్మలకుంటలో చేప పిల్లలను వదులుతున్న మత్స్యకారులు

ప్రమాదకరంగా కల్వర్టు



కల్వర్టుపై ఏర్పడిన గుంత

మండలంలోని మేడిపూర్ నుంచి పొల్మూరు, గుట్టలపల్లి మీదుగా తెలకపల్లి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు పొల్మూరు సమీపాన ఉన్న కల్వర్టుపై ఏర్పడిన గుంత ప్రమాదభరితంగా మారింది. గుంత చుట్టు ముళ్ల కంప ఉంచారు. దీంతో వాహనదారులు రాకపోకలను ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి కల్వర్టును పరిశీలించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. అదేవిధంగా ప్రహరీ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. –తాడూరు

మంత్రి దిష్టిబొమ్మ దహనం



అచ్చంపేటలో మంత్రి సత్యవతి రాథోడ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

అచ్చంపేట రూరల్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అంగన్‌వాడీ టీచర్లు ఆదివారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్ మాట్లాడుతూ 14 రోజుల నుంచి అంగన్‌వాడీ టీచర్లు నిరవధిక దీక్ష చేస్తున్నా మంత్రి పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అంగన్‌వాడీల సమస్య నా పరిధిలో లేదని మంత్రి అనడం సిగ్గు చేటన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తగిన బుద్ధి చెప్తామన్నారు. కార్యక్రమంలో భారతి, చంద్రకళ, అలివేల, సంధ్య, సుగుణ, పద్మ, జయ, హరిత, రాణి, మల్లమ్మ, నాగలక్ష్మి, శంకరమ్మ పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జయమ్మ, అలివేలు, శోభ, సుజాత, పద్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి: అంగన్‌వాడీ టీచర్ల నిరవధిక దీక్షకు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గోపస్ లక్ష్మణ్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో చంద్రకళ, అక్కరి, ప్రభావతమ్మ, జహీరాబేగం, శిరీష, అలివేలుమంగ తదితరులు పాల్గొన్నారు.



తెలకపల్లిలో..

బల్మూర్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరవధిక దీక్ష చేస్తున్న అంగన్‌టీచర్లు ఆదివారం కళ్లు మూసుకొని నిరసన తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు పరిధిలోని లింగాల, ఉప్పునుంతల, బల్మూర్ మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

దళితులకు ఉచిత కరెంట్ ఇవ్వాలి

తెలకపల్లి: దళితులకు 300 యూనిట్ల వరకు ఉచిత కరెంట్‌ను ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నందిపేట భాస్కర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని గడ్డంపల్లిలో నాయకులతో కలసి ఆయన సర్వే నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలలో దళిత వాడలను సందర్శింస్తున్నామని జీఓ 342 ప్రకారం 101 యూనిట్లు ఇస్తున్నామని ప్రభుత్వం చెప్తున్నా అది ఎక్కడ కూడా అమలు కావడం లేదన్నారు. దళిత కుటుంబాలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని లేనపక్షంలో సబ్‌స్టేషన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. భాస్కర్, జగదీష బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సర్వే నిర్వహిస్తున్న నాయకులు

పథకాల పేరుతో మోసం



బిజినేపల్లి: పథకాల పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని బహుజన్ ముక్తి పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ నరికె నరేందర్ ఆరోపించారు. ఆదివారం మండలంలోని సల్కర్‌పేటలో బహుజన తిరుగుబాటు యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్య, వైద్య, ఉపాధి కల్పన, అభివృద్ధిని పట్టించుకోకుండా వ్యక్తిగత పథకాలు చేపట్టి ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో గడ్డం విజయ్, వెంకటయ్య, బండి విజయ్, శేఖర్, మహేష్, విజయ్, ఆనంద్, జగన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థికి బాక్సింగ్‌లో వెండి పతకం



లింగాల: మండల కేంద్రానికి చెందిన గిరిజన విద్యార్థి పాత్లావత్ ఓంకార్‌నాయక్ ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి పోటీలలో బాక్సింగ్ విభాగంలో వెండి పతకం సాధించాడు. తండ్రి పాత్లావత్ కృష్ణానాయక్ హైదరాబాద్‌లో ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. విద్యార్థి తండ్రి వద్ద ఉంటూ హైదరాబాద్ గాంధీ భవన పాఠశాలలో 10వ తరగతి చదువుకుంటున్నాడు. ఈ నెల 20 నుంచి 23 వరకు ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) పోటీలలో ప్రతిభ కనబర్చి వెండి పతకం సాధించాడు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడు విద్యార్థిని అభినందించారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో అవస్థలు

బల్మూర్: మండలంలోని పలు గ్రామాల్లో సమయపాలన లేకుండా విద్యుత్ కోతలు విధిస్తున్నారు. ప్రభుత్వ పాలకుల మాటలకు క్షేత్రస్థాయిలో అమలులో పూర్తిగా విరుద్ధంగా ఉంది. విద్యుత్ సరఫరా ఎప్పుడు చేస్తారో తెలియని దుస్థితి నెలకొంది. గ్రామాల్లో అప్రకటిత విద్యుత్ కోతలతో వినియోగదారులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా మండల కేంద్రంలో విద్యుత్ సరఫరాలో నిత్యం అంతరాయం ఏర్పడుతుండటంతో కార్యాలయాల్లో, బ్యాంక్‌లో, మీసేవా కేంద్రాల్లో వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడింది. రాత్రివేళ కరెంట్ నిలిపివేస్తే ఉదయం వరకు అంధకారంలో ఉండాల్సిందే. విద్యుత్ అధికారి, సిబ్బంది స్థానికంగా ఉండకపోవడంతోనే అప్రకటిత కోతలు, లోవోల్టేజీ సమస్య తలెత్తుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని రైతులు, గృహవినియోగదారులు కోరుతున్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి

మన్ననూర్: స్థానిక మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రామావత్ హీర్యా నాయక్ (65) గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు వివరాల ప్రకారం హీర్యా నాయక్ రెండు రోజుల కిందట వ్యవసాయ పొలంలో పనులు చేసి అస్వస్థకు గురికాగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. ఆదివారం ఉదయం అకస్మాత్తుగా గుండెనొప్పి వచ్చింది. వైద్యులు పరీక్షిస్తుండగా తుదిశ్వాస వదిలాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ కాంగ్రెస్ నాయకులు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.

అటవీశాఖ ఉద్యోగి..

మన్ననూర్: అటవీశాఖలో విధులు నిర్వహిస్తున్న వాచర్ గుండె పోటుతో మృతి చెందిన సంఘటన చోటు చేసుకున్నది. ప్రశాంతి నగర్ (మన్ననూర్) గ్రామానికి చెందిన వెంకటయ్య (54) కొంత కాలంగా దినసరి వేతనంతో అచ్చంపేట రేంజ్ పరిధిలో వాచర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం విధుల్లో ఉండగా ఛాతీలో నొప్పిరావడంతో తోటి ఉద్యోగులు అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన ఆసుపత్రి వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఇదిలా ఉండగా మృతుడి సోదరుడు గత నెల కిందట గుండెపోటుతో మృతి చెందిన ఘటన మరిచిపోకముందే అన్న వెంకటయ్య మృతిచెందడం బాధకరమని గ్రామస్తులు పేర్కొన్నారు.



హీర్యా నాయక్(ఫైల్)

అనారోగ్యంతో..

ఉప్పునుంతల: మండలంలోని సూర్యతండా చెందిన బాల్యానాయక్ అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆదివారం తండాకు చేరుకనొ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ రంగారెడ్డి, నాయకులు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పండ్లు, బ్రెడ్లు పంపిణీ



కొల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ నాయకుడు చింతలపల్లి జగదీశ్వర్‌రావు జన్మదినం సందర్భంగా ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు, విశ్వశాంతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అంతకుముందు కార్యకర్తలు కేక్ కట్ చేశారు. కార్యక్రమాల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాముయాదవ్, మండల అధ్యక్షుడు పరశురామ్‌నాయుడు, నాయకులు కాంతారావు, ఖాదర్ పాషా, వెంకటస్వామి, నాగన్న, జాకీర్, రాంచందర్ నాయుడు తదితరులున్నారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌రావు జన్మదిన వేడుకలను కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ సభ్యులు పాపిరెడ్డి, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు బాలపీర్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రసూల్, సయ్యద్, ముష్టిపల్లి ఎంపీటీసీ ఖాజా, కురుమయ్య, శ్రీను, వెంకటస్వామి, డిల్లి రాములు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దుర్వాసనతో సతమతం



తాడూరు: మండల కేంద్రంలోని ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డును అనుసరించుకొని ఉన్న మురుగు కాల్వ అసంపూర్తిగా ఉంది. దీంతో మురుగు ఒకేస్థలంలో నిల్వ ఉంటోంది. ఈ దారి గుండా పోయే ప్రయాణికులు దుర్వాసనతో సతమతమవుతున్నారు. కంపు వాసన భరించలేక నరకయాతన అనుభవిస్తున్నారు. సమీపంలో పోచమ్మ ఆలయం ఉండటంతో అమ్మవారిని దర్శించుకొనేందుకు వచ్చే భక్తులు నానా అవస్థలు పడుతున్నారు. రోడ్డు వెంట వెళ్లే విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి అసంపూర్తిగా వదిలిన మురుగుకాల్వను పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అధ్వానంగా రోడ్డు



కొల్లాపూర్ రూరల్: మండలంలోని అమరగిరి బీటీ రోడ్డు గుంతలమయంగా మారింది. ప్రయాణించడానికి వీలులేకుండా పోయిందని గ్రామస్తులు వాపోయారు. 10 సంవత్సరాల కిందట నిర్మించిన రోడ్డు అధ్వానంగా తయారైంది. గ్రామస్తులు కొల్లాపూర్ పట్టణానికి వెళ్లేందుకు నరకయాతన అనుభవిస్తున్నారు. గ్రామం నుంచి పట్టణానికి 8 కిలో మీటర్ల దూరం ఉందని నిత్య వివిధ పనుల నిమిత్తం వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణానది నది తీరం దగ్గరగా గ్రామం ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి జాలర్లు, పర్యాటకులు నిరంతరం ప్రయాణిస్తు ఉంటారని స్థానికులు వివరించారు. రోడ్డు దెబ్బతినడంతో పర్యాటకులు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదని వాపోయారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.